పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు
- అనుమతులు, ఫిర్యాదుల కోసం అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలు
- చార్మినార్ రిటర్నింగ్ అధికారి వెంకన్నతో ఇంటర్వ్యూ


వెంకన్న, చార్మినార్ రిటర్నింగ్ అధికారి

చార్మినార్: పకడ్బందీగా పోలింగ్ నిర్వహించడానికి ముందస్తు చర్యల్లో నిమగ్నమయ్యామని చార్మినార్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. పాతబస్తీలోని చార్మినార్ నియోజకవర్గంలో ఈసారి పోలింగ్ శాతం పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు తగిన ఏర్పాట్లు చేసామన్నారు. నామినేషన్ల ఉపసంహరణతో ఇక నవంబర్ 30న నిర్వహించే పోలింగ్‌పై దృష్టిసారించామన్నారు. ఇప్పటికే అవసరమైన అన్ని స్థాయిల్లో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. ఓటర్లకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. అన్ని స్థాయిల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి పోలింగ్‌తో పాటు కౌంటింగ్‌లను పకడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన ముందు జాగ్రత్త చర్యలన్నింటిని తీసుకుంటున్నాని ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు.

నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెంచదానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

పోలింగ్ సిస్టమెటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ ఎలక్షన్ పార్టిసిపేషన్ ద్వారా స్థానిక ఓటర్లకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. బూత్ లెవల్ అవేర్‌నెస్ గ్రూపులను ఏర్పాటు చేసి బస్తీల్లో ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని స్థానిక ఓటర్లకు అందజేస్తున్నాం.

నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ స్టేషన్లు ఎన్ని?

198 పోలింగ్ స్టేషన్లు.

నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు ఎంతమంది?

మొత్తం ఓటర్లు 2,24,066 ఉండగా.. ఇందులో 1,17,480 మంది పురుషులు, 1,06,558 మంది మహిళ ఓటర్లు, 28 థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతులు మంజూరు చేయడంలో ఆలస్యమవుతుందని కొంత మంది అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. దీనికి మీ సమాధానం

అనుమతులన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నాయి. ఎక్కడా ఆలస్యానికి ఆస్కారమే లేదు. ఈసారి జరిగే ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ కొత్తగా ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. పార్టీ ప్రచారాలు, పాదయాత్రలు, బహిరంగ సభలు తదితర ఎన్నికల ప్రచారాల అనుమతి కోసం 'ఈ సువిదా'అనే ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి వచ్చింది.

ఫిర్యాదుల కోసం?

ఎవరైన అభ్యర్థులు, పార్టీలు, ప్రచారాలపై ఫిర్యాదు చేయడానికి 'సీ-విజిల్'అనే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

ఎన్నికల ఓట్ల లెక్కింపు తదితర వివరాలు తెలపండి?

నాంపల్లిలోని కమల నెహ్రూ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కౌంటింగ్ (డీఆర్‌సీ)ను ఏర్పాటు చేశాం. తనతో పాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు డీడీ నాయక్, నిహారిక, ఛాముండేశ్వరి, అబ్దుల్ ఖాదర్ తదితరులు విధినిర్వహణలో ఉంటారు.

ఎంతమంది నామినేషన్లు వేశారు? ఎంతమంది ఉపసంహరించుకున్నారు? ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి?

చార్మినార్ నియోజకవర్గంలో మొత్తం 22 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా.. ఇందులో 8 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఎవరు ఉపసంహరించుకోలేదు.

నియోజకవర్గంలో ప్రస్తుతం ఎంత మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు.


ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 14 మంది బరిలో ఉన్నారు.

స్వచ్ఛమైన పాలన బీజేపీకే సాధ్యం


కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

గోల్కొండ: స్వచ్ఛమైన పాలన బీజేపీకే సాధ్యమని ఆ పార్టీ టోలిచౌకి డివిజన్ అధ్యక్షుడు బొమ్మల శ్రీకాంత్‌చారి అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ డివిజన్‌లోని రిసాల బజార్, మోహల్లా గంజ్, బంజారా దర్వాజ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్వాన్ బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ ప్రజల మనిషి అని సుదీర్ఘ కాలంగా ప్రజా సేవ చేస్తున్న వ్యక్తి అని అన్నారు. మల్లేష్‌చారి, జగదీష్, సురేష్‌చారి, గౌతమ్, వినయ్ తదితరులున్నారు.

అభివృద్ధి కోసం మజ్లిస్‌ను గెలిపించాలి


గోల్కొండలో ప్రచారంలో మజ్లిస్ అభ్యర్థి కౌసర్

గోల్కొండ: అభివృద్ధి కోసం మజ్లిస్ పార్టీని గెలిపించాలని కార్వాన్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మజ్లిస్ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ, టోలిచౌకీ డివిజన్లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాదయాత్ర చేస్తూ ఇంటింటికి తిరిగి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నియోజకవర్గ సమస్యలను పట్టించుకోని పార్టీల అభ్యర్థులను నిలదీయాలని ఆయన కోరారు. కేవలం ఎన్నికల సమయంలోనే బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రజల వద్దకు వస్తారని ఎన్నికలు ముగియగానే వీరంతా ఎక్కడికిపోతారో ఎవరికి తెలియని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, మజ్లిస్ ఏరియా కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రాహూఫ్, నాయకులు అబీబ్‌చావూస్, మహ్మద్ జాహేద్, సిద్ధిఖ్ తదితరులున్నారు.

ఫుడ్ పాయిజన్ కేసులో మండీ బిర్యానీ హోటల్ సీజ్


ఎమ్మెస్ మండీ బిర్యానీ హోటల్‌లో శాంపిల్స్ సేకరిస్తున్న ఫుట్ సేఫ్టీ అధికారులు

చార్మినార్: పురానీహవేలీలోని ఎమ్మెస్ మండీ బిర్యానీ హోటల్‌లో మండీ బిర్యానీ తిన్న వారికి ఫుడ్ పాయిజన్ కావడంతో దాదాపు 30 మంది వరకు చికిత్స పొందుతున్నారు. ఆదివారం కూడా వీరి ఆరోగ్య పరిస్థితి మెరుగవ్వ లేదు. విషయం తెలిసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు సిరాజ్ అహ్మద్, రాజేశ్వరి తదితరులు హోటల్‌కు చేరుకుని ఫుడ్ శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు తరలించారు. ల్యాబ్ రిపోర్ట్ రావడానికి 14 రోజులు గడువుంటుందన్నారు. ప్రాథమిక తనిఖీలలో కొన్ని పొరపాట్లు దొర్లినట్లు తమ దృష్టికి వచ్చిందని.. అందుకే నోటీసులు జారీ చేసి హోటల్‌ను సీజ్ చేసినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి సిరాజ్ అహ్మద్ తెలిపారు. నివేదిక అందనంత వరకు హోటల్ రన్ చేయడానికి వీలు లేదని ఆయన స్పష్టం చేశారు. పురానీహవేలీలో కొంత కాలంగా ఎమ్మెస్ మండీ అండ్ షవర్మ హోటల్ కొనసాగుతోంది. ఈనెల 16,17వ తేదీల్లో కొంత మంది ఈ హోటల్‌లో మండీ బిర్యానీ ఆర్డర్ ఇచ్చి తిన్నారు. కొంత మంది పార్సిల్స్ తీసుకెళ్లి తిన్నారు. బిర్యానీ తిన్న అనంతరం వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి రావడంతో నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రితో పాటు నూర్‌ఖాన్ బజార్‌లోని జాఫ్రియా ఆస్పత్రిలో చేరి చికిత్సలు పొందుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల నివేదిక మేరకు తాము తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

ప్రతిఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలి


సుబ్బారావుకు బిరుదును ప్రదానం చేస్తున్న దృశ్యం

గన్‌ఫౌండ్రీ: ప్రతిఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు అన్నారు. ఆదివారం శృతిలయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బండారు సుబ్బారావు 68వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు సర్వీస్ ఐకాన్ బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు గాయనీ గాయకులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శృతిలయ ఆర్ట్స్ కార్యదర్శి ఆమని, కళాపత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, కుసుమ భోగరాజు పాల్గొన్నారు.

ఘాన్సీబజార్‌లో మెఘారాణి పాదయాత్ర


తనకే ఓటు వేయాలని కోరుతున్న మెఘారాణి

చార్మినార్: చార్మినార్ నుంచి తనకే ఓటు వేసి గెలిపించాలని చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెఘారాణి స్థానిక ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘాన్సీబజార్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు. పవన్ మిశ్రా, తరుణ్ అగర్వాల్, సింగానియా పాల్గొన్నారు.

బహదూర్‌పురాలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం



బహదూర్‌పురా: బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేశ్ కుమార్ దూద్‌బౌలి డివిజన్‌లో ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రూ.500లకే గ్యాస్, వృద్ధులకు చేయూత, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లకి బ్రహ్మాండమైన ప్రతిస్పందన లభిస్తుందన్నారు.

ఘనంగా అర్జున్ మహారాజ్ జయంతి


వేడుకల్లో కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు

సుల్తాన్‌బజార్: భారతి కల్చరి సంవర్ధీయ ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో భగవాన్ సహస్రబు అర్జున్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ హాజరై అర్జున్‌మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాకేష్ జైస్వాల్ మాట్లాడుతూ..కల్వార్ గౌడ్ సమాజాలకు చేసిన సేవలు ఎనలేనివన్నారు. రానున్న రోజుల్లో అర్జున్ మహారాజ్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమార్‌గౌడ్, అమర్నాథ్ జైస్వాల్, అజయ్ జైస్వాల్, రాజేందర్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం


మాట్లాడుతున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: పదేళ్లుగా అన్ని వర్గాల వారికి బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉండి సహాయ సహకారాలు అందించిందని గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ఏ ఒక్కరోజు కూడా వ్యాపారస్థులకు, ఎవ్వరికి కూడా ఎలాంటి సమస్యలు రాకుండా తాను అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరించానన్నారు. సీతారాంబాగ్‌లో పలు కుల సంఘాలు, పలు సమాజాలు, వ్యాపారస్థులు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఒక్కసారి మార్వాడి సమాజ్‌కు చెందిన తనను గెలిపిస్తే వ్యాపారస్థులకు, అన్ని వర్గాల వారికి అండగా ఉండి వారి అభివృద్ధికి, వారి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. తనని గెలిపిస్తే వ్యాపారస్థులకు 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు. ఎలాంటి సమస్య తలెత్తకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద ఎత్తున పలు కుల సంఘాల వారు, వ్యాపారస్థులు, పలు సమాజ్‌ల నాయకులు పాల్గొన్నారు.

సీతారాంబాగ్‌ను సందర్శించిన రూతేశ్వర్ జీ మహరాజ్


సీతారాంబాగ్‌లో రూతేశ్వర జీ మహరాజ్, మాధవీలత

అబిడ్స్: సీతారాంబాగ్ రామ మందిరంలో లతమా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవీలత ఆధ్వర్యంలో కొనసాగుతున్న భారత భాగ్య సమృద్ధి యజ్ఞ కార్యక్రమాన్ని బృందావనంకు చెందిన సద్గురు రూతేశ్వర జీ మహరాజ్ సందర్శించారు. ఆదివారం మాధవీలతతో కలిసి యజ్ఞంలో పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడే వ్యక్తులకు, పార్టీలకు ప్రజలు మద్దతు తెలపారన్నారు. హిందూ సనాతన ధర్మంపై పలు కోణాల నుంచి దాడులు జరుగుతున్నాయన్నారు. వాటిని తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. భారతభాగ్య సమృద్ధి కోసం, భారత సస్యశ్యామలం కోసం ఈ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు మాధవీలత తెలిపారు. ఈ కార్యక్రమంలో హేమన్ సింగ్, ప్రమోద్ కుమార్, పలువురు హైందవులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని చూసి అన్ని వర్గాలు ఆదరిస్తున్నాయి'


ముత్యాల శేఖర్‌బాబుతో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

లంగర్‌హౌస్: కార్వాన్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను చూసి అన్ని వర్గాల ప్రజలు తనను ఆదరించి మద్దతు పలుకుతున్నారని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. ఆదివారం రాత్రి ఆయన లంగర్‌హౌస్ ప్రశాంత్‌నగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఎంఐఎం సీనియర్ నాయకురాలు సునంద ఆధ్వర్యంలో సాయిటెక్ పెయింట్స్ ముత్యాల శేఖర్ బాబును కలిశారు. ఆయన సమక్షంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబుతో పాటు బస్తీవాసులు ఎమ్మెల్యే కౌసర్‌కు మద్దతు పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల్లో అభిమానం చూసి తనకు మరింత బాధ్యత పెరుగుతుందన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

సంతోష్‌నగర్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా యాసిడ్ తాగి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హఫీజ్‌బాబానగర్‌కు చెందిన సయ్యద్ ఖలీల్ (34), హసీనా బేగం దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఖలీల్‌కు కొన్ని రోజులుగా పని దొరకకపోవడంతో మానసికంగా కృంగిపోవడంతో పాటు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇందులో భాగంగా ఈనెల 1న ఖలీల్ బాలాపూర్‌లోని కల్లు కాంపౌండ్‌లో కల్లు తాగి అనంతరం హార్డ్‌వేర్ షాపులో యాసిడ్‌ను కొనుగోలు చేసి తాగాడు. అనంతరం అక్కడి నుంచి ఇంటి వద్దకు వెళ్లి పడిపోయాడు. కుటుంబసభ్యులు ఖలీల్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఖలీల్ ఆదివారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

'సమ్మేళనాలు స్నేహభావాలను పెంపొందిస్తాయి'


దీపావళి సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న శిశీర్ అగర్వాల్, గోవింద్‌రాఠి తదితరులు

అబిడ్స్: సమ్మేళనాలు ప్రజల్లో స్నేహభావాలు పెంపొందిస్తాయని ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ శశీర్ అగర్వాల్ పేర్కొన్నారు. అబిడ్స్ తాజ్‌మహల్ హోటల్‌లో జరిగిన రాజస్థానీ ప్రగతి సమాజ్ దీపావళి సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజస్థానీ ప్రగతి సమాజ్‌ల వారు నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజ శ్రేయస్సుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌కుమార్, రాధాకిషన్‌రావు, గోవింద్‌రాఠి, రమేష్‌కుమార్ బంగ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని పరిరక్షించుకుందాం


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో భారత ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో భారత్ బాలోత్సవ్ పేరిట చిల్డ్రన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిల్లల హక్కులు, విద్య, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ వంటి విషయాలను వివరించారు. అంతకు ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దామోదర్‌గుప్తా, సినీనటి దీపిక, గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ అధ్యక్షురాలు గిడుగు కాంతి కృష్ణ, భారత ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపకుడు లయన్ రమణారావు, ఏబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు లలిత పాల్గొన్నారు.

నానల్‌నగర్‌లో కాంగ్రెస్ ప్రచారం



గోల్కొండ: తెలంగాణను పదేళ్లుగా పాలిస్తున్న సీఎం కేసీఆర్‌కు ఈ అసెంబ్లీ ఎన్నికలు చివరి ఎన్నికలు అని కాంగ్రెస్ కార్వాన్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ అజీరి అన్నారు. ఆదివారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని ఖాదర్ బాగ్, ఇందిరానగర్, లక్ష్మీనగర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి తెలంగాణలో నిశబ్ద విప్లవం రానుందని.. ఈ నిశబ్ద విప్లవంలో పాలక ప్రభుత్వంతో పాటు బీజేపీ కూడా ఘోరంగా ఓడిపోవడం ఖాయమన్నారు. ఈ సారి నన్ను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. వేణుగౌడ్, మక్బూల్ తదితరులున్నారు.

'బీఆర్ఎస్ సంక్షేమ పథకాలే నా విజయానికి దోహదం'


ఎన్నికల ప్రచారంలో మహ్మద్ సలావుద్దీన్ లోధీ

చార్మినార్: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలే తన విజయానికి దోహదం చేస్తాయని చార్మినార్ బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం శాలిబండ డివిజన్‌లోని పలు బస్తీల్లో పాదయాత్ర నిర్వహించగా.. ఆయా ప్రాంతాల్లో తమ పార్టీకి స్థానిక ఓటర్లు అడుగడుగునా స్వాగతం పలికారన్నారు. తమ ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తితో ఉన్నారని.. అందుకే తన విజయం సునాయాసంగా మారనుందన్నారు.

టీపీసీసీ ప్రచారం, ప్రణాళికా కమిటీ కన్వీనర్‌గా అలీ మస్కతి



చార్మినార్: తెలంగాణలో జరుగుతున్న ఎన్నికలను పురస్కరించుకుని తెలంగాణ కాంపేయిన్ అండ్ ప్లానింగ్ (ప్రచారం, ప్రణాళికా) కమిటీ కన్వీనర్‌గా అలీ మస్కతిని ఏఐసీసీ నియమించింది. విజయశాంతి చీఫ్ కో ఆర్డినేటర్‌గా ఉన్న ఈ కమిటీలో 15 మందిని కమిటీ కన్వీనర్లుగా నియమించగా.. అందులో చార్మినార్‌కు చెందిన అలీ మస్కతి ఒకరు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ నియామక పత్రాన్ని జారీ చేసినట్లు అలీ మస్కతి తెలిపారు.

'గోషామహల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా'


మంగళ్‌హాట్‌లో ప్రచారం చేస్తున్న నందకిషోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: తనను గెలిపిస్తే గోషామహల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ అభ్యర్థి నందకిషోర్‌వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ఆదివారం మంగళ్‌హాట్, పూసలబస్తీ, ఆర్కేపేట్, మాగ్ర తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటా తిరుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే అన్ని ప్రాంతాలు ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, ఆధునిక వాటర్ పైప్‌లైన్ వ్యవస్థను నిర్మించి అన్ని ప్రాంతాల్లో మోడ్రన్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తానన్నారు. పదేళ్లుగా కేవలం మతాల పేరుతో ఓట్లు దండుకున్న రాజాసింగ్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఏ రోజు కూడా గోషామహల్‌లో రాజాసింగ్ ప్రజలకు అందుబాటులో లేరని కేవలం ఇతర రాష్ట్రాల్లో తిరుగుతూ.. గోషామహల్ అభివృద్ధిని గాలికి వదిలేశారని నందకిశోర్ బిలాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌సింగ్, బల్‌దీప్, ఉమాదేవి వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవే రోటరీ క్లబ్ లక్ష్యం


విజేతలతో జయంత్‌ఠాగూర్, రోటేరియన్ అనిల్ రాంచందాని

గోల్కొండ: సమాజ సేవే రోటరీ క్లబ్ లక్ష్యమని రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ అధ్యక్షుడు రోటేరియన్ అనిల్ రాంచందాని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల కోసం టాయిలెట్స్ నిర్మించడానికి రోటరీ క్లబ్ వారు ఫండ్ రైజింగ్ గోల్ఫ్ ఫర్ చారిటి గర్నమెంట్ 2023 నిర్వహించారు. ఆదివారం గోల్కొండ నయాకీలాలోని హైదారాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ గోల్ఫ్ కోర్సులో ఈ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన రోటేరియన్స్‌కు ఆయన హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్‌ఠాగూర్‌తో కలిసి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఫండ్ రైజింగ్ ద్వారా కోటి రూపాయలు విరాళాల రూపంలో వచ్చిందని, వీటి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల కోసం వంద టాయిలెట్స్ నిర్మిస్తామని ఆయన అన్నారు. సికింద్రాబాద్ గురుద్వారాలో 15 పడకల డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని ప్రతి యేటా ఇక్కడ నామమాత్రం చార్జీలతో పది వేల మందికి డయాలసిస్ అందిస్తున్నామని తెలిపారు. ఈరోజు నిర్వహించిన ఛారిటీ గోల్ఫ్ టోర్నమెంట్‌లో వంద మంది ఔత్సాహిక గోల్ఫర్లు పాల్గొన్నారని ఆయన అన్నారు.

'కార్వాన్‌లో గెలుపు మాదే'


ఛత్రపతికి నివాళులర్పించి ప్రచారం చేపట్టి కార్వాన్ బీజేపీ అభ్యర్థి

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీ పూర్వ వైభవాన్ని సంతరించుకుని గెలుపుబాటపై పయనిస్తుందని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జియాగూడ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేలం చేరుకున్న అయ్యప్పలు


వినయ్ గురుస్వామి, రాజేష్ గురుస్వామి, హేమంత్ గురుస్వాముల బృందం

అబిడ్స్: పలువురు అయ్యప్ప స్వాముల బృందం కాలినడకతో శబరియాత్ర ప్రారంభించి ఆదివారం నాటికి తమిళనాడు సేలంకు చేరుకున్నారు. గోషామహల్ గౌలిగూడ, శ్రీనగర్‌కాలనీతో పాటు నగరానికి చెందిన వినయ్ గురుస్వామి, రాజేష్ గురుస్వామి, రాజ్‌పాల్ గురుస్వామి, కృష్ణ గురుస్వామి, కార్తిక్‌రెడ్డి స్వామి, హేమంత్ గురుస్వామి, లక్ష్మణ్‌గురుస్వామి, క్రాంతి గురుస్వాములతో పాటు పలువురు అయ్యప్పస్వాములు గత నెల 28న పాతబస్తీ భాగ్యలక్ష్మి ఆలయం నుంచి కాలినడకన శబరిమలైకు పయనమయ్యారు. ఆదివారం నాటికి 780 కిలోమీటర్లు నడిచినట్లు అయ్యప్పస్వాములు తెలిపారు. శివాజీ మహరాజ్ గురుస్వామి ఆశీర్వాచనాల నడుమ కాలినడకన పాదయాత్ర విజయవంతంగా కొనసాగుతుందని వివరించారు.

'అవకాశమిస్తే సేవకుడిగా పని చేస్తా'


ప్రచారంలో వీరేందర్ బాబు యాదవ్

గౌలిపురా: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం గౌలిపురా డివిజన్‌లోని గంగపుత్ర సంఘం, కుమ్మరివాడి, హరిజన బస్తీ, సీబీ క్వార్టర్స్, నల్ల పోచమ్మ బస్తీ, సర్దార్ పటేల్‌నగర్ తదితర ప్రాంతాల్లో బీజేపీ యాకుత్‌పురా అభ్యర్థి ఎన్.వీరేందర్ బాబు యాదవ్ పాదయాత్ర నిర్వహిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వీరేందర్ యాదవ్ మాట్లాడుతూ..ఈసారి ప్రజలు తనకు అవకాశం కల్పిస్తే సేవకుడిగా పని చేస్తానన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు ఆలే జితేంద్ర, కె.సహదేవ్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు ఆదర్శ మహేశ్, సీహెచ్.రూప్‌రాజ్, జమాల్‌పూర్ చంద్రశేఖర్, ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్, జి.ధీరజ్‌లాల్, ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, ఎం.వెంకటేశ్, జి.రఘుకాంత్, పి.రాజేశ్వర్ రావు, కొడి సురేందర్, డి.యాదగిరి, కె.ప్రేమ్, కె.రాజ్ కుమార్, ఎ.భానుప్రకాశ్, బొట్టు వెంకట్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



జియాగూడ: సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సెక్యులర్ భావాలు గల బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు ఓటు వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే మహేష్‌నగర్‌లో మిత్రకృష్ణ కుమారుడు మిత్ర అభిషేక్ కూడా ఇంటింటికి వెళ్లి ఓటు వేయాల్సిందిగా తన తండ్రిని భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తూంకుంట అరుణ్‌కుమార్, తూంకుంట లహరి తదితరులు పాల్గొన్నారు.

తేజ్ కుమార్ సంస్మరణ సభ

బహదూర్‌పురా: జూపార్కులో బటర్‌ఫ్లై కన్జర్వేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న తేజ్ కుమార్‌కు సంతాపంగా సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జూ అధికారులు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా బటర్ ఫ్లై పార్కులకు శంకుస్థాపన చేయడంలో కీలకపాత్ర పోషించారు. సాధారణంగా పర్యావరణం, ముఖ్యంగా సీతాకోక చిలుకల కోసం చేసిన సేవలను కొనియాడారు. అతని మార్గదర్శకత్వంలో బటర్ ఫ్లై కన్జర్వేషన్ సొసైటీ ఒక శక్తివంతమైన ప్రభుత్వేతర సంస్థగా రూపాంతరం చెందింది.